
చిగురిస్తున్న చిత్తూరు



ఐదేళ్ల అరాచకం అంతమైంది. విధ్వంసంలోంచి నిర్మాణం దిశగా పాలన మళ్లింది. కొత్త ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తర్వాత వస్తున్న తొలి ఉగాదికి చిత్తూరు జిల్లా ప్రజలు కోటి ఆశలతో స్వాగతం పలుకుతున్నారు. ఈ పది నెలల కాలంగా జిల్లాలో జరుగుతున్న పనులను చూసి భవిష్యత్తుపై నమ్మకాలు పెంచుకుంటున్నారు.
విశ్వావసు నామ సంవత్సరంపై జిల్లా ప్రజల్లో చిగురు తొడుగుతున్న ఆశలు ఇవీ...

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

అరాచకం నుంచి అభివృద్ధి వైపు అడుగులు

బంగారు బాటలు రెండు హైవేలు

బెంగుళూరు-చెన్నై ఎక్స్‌ప్రెస్ వే, చిత్తూరు- తచ్చూరు హైవే భవిష్యత్తులో జిల్లా అభివృద్ధికి బంగారు బాటలు కానున్నాయి.దక్షిణ భారతదేశంలోనే కీలకమైన రెండు మహానగరాలకు ఈ హైవేలు మన జిల్లాను మరింత చేరువ చేయనున్నాయి.పారిశ్రామికంగా, ఐటీ పరంగా అభివృద్ధికి ఇవి ఊతమిస్తాయని ఆశిస్తున్నారు. చెన్నై-బెంగుళూరు ఎక్స్‌ప్రెస్ వే మన జిల్లా పరిధిలో రూ.3997 కోట్లతో 80కిలోమీటర్లు ప్రయాణిస్తుండగా.. వచ్చే ఏడాది మార్చిలోగా పనులు పూర్తి కానున్నాయి. అలాగే రూ.2366 కోట్లతో మన జిల్లాలో 75 కిలో మీటర్లు ప్రయాణించే చిత్తూరు- తచ్చూరు హైవే ఈ ఏడాది అక్టోబరు కల్లా పూర్తి కానుంది.



హంద్రీనీవా పరుగులు

వైసీపీ ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో హంద్రీనీవా పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉన్నాయి. చంద్రబాబు సీఎం అయ్యాక హంద్రీనీవా మెయిన్ కెనాల్‌తో పాటు, పుంగనూరు, కుప్పం బ్రాంచి కెనాల్స్ పనులు చకచకా జరుగుతున్నాయి. ఈ రెండు బ్రాంచి కెనాల్స్‌లో కాంక్రీట్ లైనింగ్ పనుల కోసం డిసెంబరులో రూ.516 కోట్లను మంజూరు చేయగా.. వచ్చే మే నెలలోగా పూర్తయ్యేలా పనులు వేగం అందుకున్నాయి.



గతుకులు పూడిన రోడ్లు



పల్లె పండుగలో భాగంగా రూ.వంద కోట్లతో 1372 సీసీ రోడ్ల పనులు మంజూరయ్యాయి. వాటిలో 1225 పూర్తయ్యాయి. అలాగే రూ.22 కోట్లతో గుంతలున్న ఆర్‌అండ్‌బీ రోడ్లకు మరమ్మతులు చేశారు. ఐదేళ్ల గతుకుల ఇక్కట్లు జిల్లా ప్రజలకు తప్పాయి.

మామిడి బోర్డు వైపు అడుగులు

రాష్ట్రంలోనే మన జిల్లా మామిడికి ప్రసిద్ధి. తాజాగా మామిడి బోర్డు ఏర్పాటుకు ఎంపీ దగ్గుమళ్ల పార్లమెంటులో మాట్లాడడంతో పాటు ఎమ్మెల్యేలు రాష్ట్ర ప్రభుత్వంతో చర్చిస్తున్నారు. కలెక్టర్ల సదస్సులో కూడా చిత్తూరులో మామిడి బోర్డు ఏర్పాటు చేస్తామని సీఎం చెప్పారు. ఈ పరిణామాలు మామిడి రైతుల్లో ఆశలు రేపుతున్నాయి.

యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు బంగారుపాళ్యంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుచేశారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళి కొత్తవాడైనా నియోజకవర్గ సమస్యలపై అసెంబ్లీలో గొంతు విప్పుతుండడం ఆ ప్రాంత ప్రజల్లో ఆశలు రేపుతోంది.



అభివృద్ధికి ఐకాన్.. కుప్పం

సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. సీఎం అయ్యాక ఇప్పటికే రెండుసార్లు పర్యటించారు. కుప్పం అభివృద్ధి మండలి (కడ)ని ఏర్పాటుచేసి ప్రత్యేకంగా ఓ ఐఏఎస్ అధికారిని నియమించారు. ఎయిర్‌పోర్టు, కేంద్రీయ విద్యాలయ, కృషి విజ్ఞాన కేంద్రాల మంజూరు, ననియాల ఎకో ఫారెస్టు అభివృద్ధి వంటి పనులు పురోగతిలో ఉన్నాయి. జిల్లాలో అభివృద్ధికి ఐకాన్‌గా కుప్పం మారనుంది.



చిత్తూరులో యూనివర్సిటీ

చిత్తూరులో కేంద్రీయ విద్యాలయ మంజూరు, పీవీకేఎన్‌ను యూనివర్సిటీగా ఏర్పాటు చేసేందుకు చర్యలు, అడవిపల్లె రిజర్వాయర్ నుంచి చిత్తూరుకు నీళ్ల కేటాయింపు, రహదారుల అభివృద్ధి వంటి పనులు పురోగతిలో ఉన్నాయి. ఎమ్మెల్యే గురజాల జిల్లా కేంద్రం అభివృద్ధిపై పూర్తి శ్రద్ధ పెట్టారు. జిల్లాల విభజనలో వెనుకబడిన చిత్తూరు అభివృద్ధి దిశగా పరుగు అందుకుంటుందనే నమ్మకం ప్రజల్లో పెరిగింది.

జీడీ నెల్లూరులో పారిశ్రామికవాడ

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే థామస్ సూచన మేరకు చిత్తూరు- తచ్చూరు హైవేకు సమీపంలో 2 వేల ఎకరాల భూసేకరణ చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఇది సాకారమైతే చెన్నైకు దగ్గర్లో ఈ ప్రాంతం పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందుతుంది. అత్యంత వెనుకబడిన ప్రాంతం అయిన జీడీనెల్లూరు నియోజకవర్గం భవిష్యత్తు మారబోతోందనే ఆశ ఈ ప్రాంత ప్రజల్లో పెరుగుతోంది.

నేతన్నల్లో పెరిగిన హుషారు

నగరిలో పెద్దఎత్తున ఉన్న మరమగ్గ, చేనేత కార్మికులకు ఉచిత కరెంటు ఇస్తామని వైసీపీ ఎగ్గొట్టింది. దశాబ్దాలుగా కార్మికులు ఎదురుచూస్తున్న ఉచిత విద్యుత్తును ఎన్నికల హామీ మేరకు చంద్రబాబు మంజూరు చేశారు. తాజా బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. కోసలనగరంలో సేకరించిన 1650 ఎకరాల్లో పారిశ్రామికవాడ ఏర్పాటుకు ఎమ్మెల్యే భానుప్రకాష్ కృషి చేస్తున్నారు.

ఏనుగుల సమస్య పరిష్కార దిశగా..

జిల్లాలోని ఏనుగుల సమస్యను పరిష్కరించేందుకు పలమనేరు మండలం ముసలిమడుగు వద్ద ఏనుగుల శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిక్షణ పొందిన నాలుగు కుంకీ ఏనుగులు ఇక్కడికి రానున్నాయి. వాటి ద్వారా ఏనుగుల దాడుల్ని నివారించనున్నారు. ఈ విషయంలో పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి కృషి చాలా ఉంది. అలాగే 2019లో ఆగిపోయిన అభివృద్ధి పనుల్ని మళ్లీ మంజూరు చేయించి ప్రారంభించారు.

చిత్తూరులో పెరుగుతున్న రౌడీ సంస్కృతి

చిత్తూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో వుండగా చిత్తూరులో ఐదేళ్ల పాటు అక్రమ కేసులతో టీడీపీ శ్రేణుల్ని ఇబ్బంది పెట్టారు. ప్రభుత్వం మారినా వైసీపీ నాయకుల తీరులో మార్పు రాలేదు. ఎమ్మెల్యే అని కూడా చూడకుండా అత్యంత హీనంగా సామాజిక మాధ్యమాల్లో ట్రోలింగ్ చేస్తున్నారు. 2029లో టీడీపీ నాయకుల అంతు చూస్తామంటూ హెచ్చరికలు చేస్తుండడం ఘర్షణలకు, ఉద్రిక్తతలకు కారణమవుతోంది.

● అప్పట్లో ఎంపీ మనుషులపై దాడి..

ఎన్నికల సమయంలో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు కుమారుడు రాధే స్నేహితుల మీద చిత్తూరు వైసీపీ నాయకులు దాడి చేయగా.. వారిలో మురళీరెడ్డి కీలకం. ఈయనే ఈ మధ్య ఎమ్మెల్యే గురజాలను ట్రోల్ చేస్తూ వీడియో విడుదల చేశారు. 'నా పేరు శ్రీశైలం.. నేను చేస్తా రౌడీయిజం' అంటూ చిత్తూరు వాట్సాప్ గ్రూపులో వీడియో పెట్టారు. అలాగే శుక్రవారం టీడీపీ శ్రేణుల్ని హెచ్చరిస్తూ స్టేటస్ పెట్టారు. 2029లో టీడీపీ శ్రేణులకు పుష్ప-2 క్లైమాక్స్ చూపిస్తామంటూ అందులో ఉంది. ఆ స్టేటస్ చూసిన కొందరు మురళీరెడ్డి ఇంటికెళ్లి గొడవ పడ్డారు.

● ఆస్పత్రిలో టీడీపీపై వైసీపీ దాడులు

టీడీపీ, వైసీపీ శ్రేణులు చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ ఉండగా.. వైసీపీ ఇన్‌ఛార్జి విజయానందరెడ్డి పరామర్శకు వెళ్లారు. ఆస్పత్రిలో ఉన్న టీడీపీ శ్రేణులపై విజయానందరెడ్డి మనుషులు దాడి చేయగా, ఆ వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి. అక్కడే ఉన్న ఎమ్మెల్యే పీఏ కుమారస్వామి యాదవ్‌పై విజయానందరెడ్డి చిందులేశారు. వడ్డీతో సహా తిరిగిస్తానని హెచ్చరించారు.

● పోలింగ్ రోజునే ఎమ్మెల్యేపై దాడికి యత్నం

గత ఏడాది ఎన్నికల పోలింగ్ రోజున విజయానందరెడ్డి మనుషులు ఎమ్మెల్యే జగన్మోహన్ కారును వెంబడించారు. రౌడీషీటర్ ప్రసన్న, అప్పటి చుడా ఛైర్మెన్ పురుషోత్తమరెడ్డి తదితరులు జగన్మోహన్ కారు కదలకుండా చేశారు. సంతపేట పోలింగ్ కేంద్రంలో పెద్దఎత్తున ఆయన కారును చుట్టుముట్టి దాడికి యత్నించారు.అయినా కూటమి ప్రభుత్వం వచ్చాక మద్యం దుకాణాలను దక్కించుకున్న రౌడీషీటర్ ప్రసన్న వాటిని ప్రశాంతంగా నిర్వహించుకుంటున్నారంటే, తమ నాయకుడు చంద్రబాబు పాలన తీరుకు ఇది నిదర్శనమని ఎమ్మెల్యే జగన్మోహన్ చెబుతున్నారు.తాము ఇంత మంచిగా వ్యవహరిస్తుంటే వైసీపీ మూకలు దాడులకు తెగబడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సోషల్ మీడియాలో ఎమ్మెల్యేపై దుష్ప్రచారం

● టీడీపీ, వైసీపీ కార్యకర్తల ఘర్షణ ● పరామర్శించిన ఆయా పార్టీల నేతలు



గాయపడిన టీడీపీ కార్యకర్తను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్,మేయర్ అముద, దొరబాబు, సీఆర్ రాజన్- గాయపడిన మురళీని పరామర్శిస్తున్న కరుణాకర రెడ్డి తదితరులు



చిత్తూరు అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వంపై, చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్‌పై సోషల్ మీడియాలో వైసీపీ శ్రేణులు దుష్ప్రచారం చేయడంపై టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య శుక్రవారం రాత్రి ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో ఇరుపార్టీల కార్యకర్తలు గాయపడ్డారు.'2029 ఎన్నికల కౌంటింగ్‌లో టీవీ స్క్రీన్‌పై వైసీపీ 89 మ్యాజిక్ ఫిగర్ దాటిందని స్క్రోలింగ్ పడిన మరుక్షణం జరగబోయే జాతర పుష్ప-2 క్లైమాక్స్‌కు మించి ఉంటుంది. ఆ రోజున వైసీపీ కార్యకర్తలను ఎందుకు టచ్ చేసామా అని గుక్కపెట్టి ఏడుస్తారు. అప్పటి వరకు అనుభవించండి' అని రెండు రోజుల కిందట నగరంలోని 5వ డివిజన్ వైసీపీ ఇన్‌ఛార్జి మురళీరెడ్డి సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. ఈ పోస్ట్‌పై టీడీపీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. దీనిపై ప్రశ్నించిన టీడీపీ కార్యకర్తలకు శుక్రవారం రాత్రి మురళీరెడ్డి వ్యంగ్యంగా ఫోన్‌లో సమాధానమివ్వడంతో వివాదం చోటు చేసుకుంది. కొంత మంది టీడీపీ కార్యకర్తలు కొంగారెడ్డిపల్లెలో నివాసముంటున్న మురళీరెడ్డి ఇంటి వద్దకు వెళ్లి ప్రశ్నించారు. దాంతో వారి మధ్య ఘర్షణ జరగడంతో ఇద్దరు టీడీపీ కార్యకర్తలకు గాయాలవ్వగా, వైసీపీ కార్యకర్త మురళీరెడ్డికి గాయమైంది.ఈ విషయం తెలుసుకున్న నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి విజయానందరెడ్డి వన్‌టౌన్ పోలీసు స్టేషన్ వద్దకు చేరుకుని కేసు నమోదు చేయాలని డిమాండు చేయగా పోలీసులు సరే నన్నారు. శనివారం ఎమ్మెల్యే జగన్మోహన్,డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, ఇతర నేతలు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి గాయపడిన ఇద్దరు కార్యకర్తలను పరామర్శించారు. అలాగే వైసీపీ జిల్లా అధ్యక్షుడు కరుణాకరరెడ్డి, విజయానందరెడ్డి గాయపడిన వైసీపీ కార్యకర్త ఇంటికి వెళ్లి పరామర్శించారు.ఈ ఘటనకు సంబంధించి టీడీపీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజయానందరెడ్డి, మురళీరెడ్డిలపై ఓ కేసు నమోదు చేయగా.. వైసీపీ ఇచ్చిన ఫిర్యాదుతో టీడీపీ కార్యకర్తలు దిలీప్, సంతోష్‌లపై కేసు పెట్టారు. అలాగే గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్తలపై దాడి చేసిన ఘటనలో విజయానందరెడ్డితో పాటు మరో 16 మందిపై రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

అభివృద్ధిని ఓర్వలేకే వైసీపీ మూకల అల్లర్లు :టీడీపీ

చిత్తూరు రూరల్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): చిత్తూరు అభివృద్ధిని చూసి ఓర్వలేకే వైసీపీ మూకలు అల్లర్లు సృష్టిస్తున్నాయని చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్ ఆరోపించారు. 10 నెలలుగా టీడీపీ పాలనలో చిత్తూరు ప్రశాంతంగా వుందన్నారు.ఆ ప్రశాంతతను పాడు చేసే విధంగా వైసీపీ సోషల్‌మీడియాలో కొంతమంది తనతో పాటు సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి లోకేష్‌లపై అసభ్యంగా ట్రోల్ చేస్తూ కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు.ఆ వీడియోలపై పోలీసులు చర్యలు తీసుకొని ఉంటే ఇదంతా జరిగేది కాదన్నారు.టీడీపీ జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్, మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, టీడీపీ సీనియర్ నాయకులు చంద్రప్రకాష్, దొరబాబు, కాజూరు బాలాజి తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:30 (ఆదివారం సాయంత్రం)
సహర్: 4:51 (సోమవారం ఉదయం)

మహిళల ఆర్థిక స్వావలంబనే

భువనేశ్వరి అజెండా

● కుప్పంలో ముగిసిన 4 రోజుల పర్యటన



టీడీపీ ఆవిర్భావ దినోత్సవంలో కేక్ కట్ చేస్తూ



కుట్టు మిషన్లు పంపిణీ చేశాక మహిళలతో ముచ్చటిస్తూ

కుప్పం - ఆంధ్రజ్యోతి

'సంకల్పించాలే కానీ మహిళలు చేయలేని అద్భుతాలు లేవు. ఆమెలోని శక్తి అపారం.'

'ఆర్థిక స్వావలంబన కావాలి. అందుకోసం ధైర్యంగా మీరు ముందడుగు వేయాలి. మీలో ప్రతివొక్కరూ ఉపాధి పొందడమే కాదు, పదిమందికి ఉపాధి చూపించే ఎత్తులకు ఎదగాలి.'

నారా భువనేశ్వరి కుప్పం మహిళలకు ఇచ్చిన పిలుపు ఇది. అవును, ఆమె కుప్పం నియోజకవర్గానికి ఒక ముఖ్యమంత్రి సతీమణిగానో లేదా విజయం సాధించి అందలం ఎక్కిన అధికార పార్టీ అధినేత భార్యగానో రాలేదు. కేవలం ఒక మహిళగా వచ్చారు. మామూలు మహిళగా కాదు, స్వయం శక్తితో విజయవంతమైన మహిళగా వచ్చారు. ఇంకా చెప్పాలంటే భర్త జైలుపాలైనప్పుడు ఎన్నడూ అలవాటులేని ప్రజాక్షేత్రంలోకి దూకి 'నిజం గెలవాలం'టూ ప్రస్థానం సాగించి. తననుతాను రాజకీయంగా రాటుదేల్చుకున్న ఉక్కు మహిళగా ఈ పర్యటన చేపట్టారు. స్వయం ప్రకాశిత వెలుగులను సాటి మహిళలకు పంచడానికి, వారిలోని మహిళా శక్తిని మేల్కొలిపి విజేతలుగా నిలపడానికి ఈ పర్యటనను ఆమె వినియోగించుకున్నారు. నారా భువనేశ్వరి గత నాలుగు రోజులపాటు చేసిన కుప్పం నియోజకవర్గ పర్యటన విజయవంతమైంది. గుడుపల్లెలో అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌లో విద్యార్థులతో ముఖాముఖీతో మొదలైన ఆమె పర్యటన, కుప్పం పట్టణంలో ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా చిరు వ్యాపారులకు, మహిళలకు తోపుడు బండ్లు, కుట్టు మిషన్లను ఉచితంగా అందజేసిన కార్యక్రమంతో ముగిసింది. ప్రధానంగా ప్రతి మండలంలోనూ కనీసం రెండు మూడు పంచాయతీల్లో భువనేశ్వరి గ్రామీణ మహిళలతో మమేకమయ్యారు. వారి ఈతిబాధలు వినడమే కాదు, స్వయంగా తన అనుభవాలను పంచుకున్నారు. మహిళల సంక్షేమం, ఆర్థిక స్వావలంబనకోసం ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను గురించి వివరిస్తూనే, ఈ పథకాలకు అతీతంగా తమనుతాము ఉద్ధరించుకోవాలని మహిళలకు పిలుపునిచ్చారు.అలీప్‌తో కడా అనుసంధానమై ఇస్తున్న శిక్షణను మహిళలందరూ వినియోగించుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. 'నేను కూడా ఒకప్పుడు సాధారణ గృహిణినే, చంద్రబాబుగారు నాకు అప్పగించిన హెరిటేజ్ బాధ్యతను నాకు నేనుగా నేర్చుకుని మరీ నెరవేర్చా. విజయవంతంగా సంస్థను నడుపుతున్నా' అంటూ తన స్వానుభవంతో మహిళల్లో ఉత్తేజం నింపారు.పనిలో పనిగా వైసీపీ అయిదేళ్ల పాలనలో మనం మోసపోయామంటూ ప్రతిపక్షంపై విమర్శలూ గుప్పించారు. మరోవైపు శాంతిపురం మండలం నక్కనపల్లెలో పట్టు రైతులతో మమేకమై వారికి సాదకబాధకాలు పంచుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో చెప్పి సబ్సిడీలు, ప్రోత్సాహకాలు ఇప్పించేందుకు కృషి చేస్తామని మాట ఇచ్చారు.

కార్యకర్తల్లో స్ఫూర్తి నింపి

ఎక్కువగా మహిళల్లో స్ఫూర్తి నింపడానికే పర్యటన సమయాన్ని కేటాయించిన భువనేశ్వరి తెలుగుదేశం అధినేత చంద్రబాబు సతీమణిగా పార్టీ కార్యకర్తలను మరచిపోలేదు. చివరి రోజైన శనివారంనాడు పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న ఆమె, కార్యకర్తల త్యాగాలతోనే పార్టీ ఈరోజు ఈ స్థితికి చేరిందన్నారు. వారికి పార్టీ, తమ కుటుంబం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నాయకులతోనూ సమావేశాలు జరిపి పార్టీ స్థితిగతుల పైనా ఆరా తీశారు. మరోవైపు మేనేజింగ్ ట్రస్టీగా ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు ద్వారా కుట్టు మిషన్లు, తోపుడు బండ్లు పంపిణీ చేసి, పేద బడుగు బలహీన వర్గాలకు అండగా నిలబుతామన్న హామీని నిలబెట్టుకున్నారు.అధిక దర్పానికి, ఆడంబరాలకు దూరంగా, సామాన్య మహిళలకు దగ్గరగా.. ఆత్మీయంగా సాగిన భువనేశ్వరి కుప్పం పర్యటన నియోజకవర్గ ప్రజల మనసు చూరగొంది.

భక్తి ముందు ఎండ ఓడిపోయింది!





ఎండ భగభగా మండుతోంది. చెమటలు కారిపోతున్నాయి. అప్పుడే దర్శనం చేసుకుని బయటకు వచ్చారు బెంగళూరుకు చెందిన ఒక కుటుంబం. వీల్‌చైర్‌కే పరిమితమైన తల్లి. కూడదీసుకుంటూ నడుస్తున్న తండ్రి. ఇద్దరినీ గుడి ఎదురుగా జర్మన్ షెడ్ నీడలో ఉంచి, ఆ కొడుకూ కోడలూ లడ్డూల కోసం వెళ్లారు. తదేకంగా గోపురాన్నే చూస్తున్న ఆమె, భర్తను ఒక కోరిక కోరింది. 'మళ్లీ తిరిగి వస్తామో.. లేదో.. ఇంకొక్కసారి ఆ సామికి దణ్ణం పెట్టుకోవాలని ఉందయ్యా' అని. అతను తలెత్తి ఒక్క క్షణం నిప్పులు కురుస్తున్న ఆకాశంకేసి చూశాడు. ఆ వెంటనే, 'పద వెళ్దాం' అన్నాడు. వీల్ చైర్‌ను తోసుకుంటూ గోపురం వైపు కదిలాడు. పైన ఎండ.. పాదాలు మాడిపోతున్నాయి. అలిసిపోతూ, ఆగుతూ.. మునివేళ్ల మీద నడుస్తూ వీల్‌చైర్‌ను గొల్ల మండపం దగ్గరకు తీసుకువెళ్లాడు. అక్కడ గుడికి అభిముఖంగా ఇద్దరూ నేల మీద సాష్టంగపడి దణ్ణం పెట్టుకున్నారు. తడి కళ్లతో ఆమె భర్తను చూసింది. అతను సంతృప్తిగా నవ్వాడు. 90లకు దగ్గరవుతున్న వయసు వారిది. 58 ఏళ్ల దాంపత్య బంధం బలం అది. వారి భక్తి ముందు సూర్యుడు కూడా తల వంచాడు కదా అని ఆ వృద్ధ జంటను చూసిన వారు అనుకున్నారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి





మోషేన్‌రాజు - తరుణ్‌భాస్కర్, ఈషా రెబ్బా

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఏపీ శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, సినీ దర్శకుడు తరుణ్‌భాస్కర్, హీరోయిన్ ఈషా రెబ్బా ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 15 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.4.15 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 65,569

తలనీలాలు సమర్పించినవారు: 21,780



జిల్లాకు ఉగాది పురస్కారాల పంట

రాష్ట్ర ప్రభుత్వం సాహిత్య, కళా రంగ ప్రముఖులకు శనివారం ప్రకటించిన కళారత్న (హంస), ఉగాది పురస్కారాలు జిల్లాలో 11 మందిని వరించాయి. ఆదివారం విజయవాడలో నిర్వహించే ఉగాది కార్యక్రమంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా వీరు పురస్కారాలను అందుకోబోతున్నారు. కళా రత్న పురస్కార గ్రహీతలకు రూ.50 వేల నగదుతోపాటూ హంస ప్రతిమ అందజేస్తారు. ఉగాది పురస్కార గ్రహీతలకు రూ.10వేల నగదు, సర్టిఫికెట్‌తో సత్కరిస్తారు.

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి

ఆముదాల మురళి



తవణంపల్లె మండలం అత్తిమాకులపల్లెలో 1975లో పుట్టారు. కర్ణాటకలోని ముక్త విశ్వవిద్యాలయం నుంచీ సంస్కృతంలో పీజీ పూర్తి చేశారు. 200 అష్టావధానాలు, 3 శతావధానాలు చేశారు. అవధాన కళానిధి, అవధాన శేఖర, అవధాన రత్నాకర బిరుదులు పొందారు. సుమారు 15 పుస్తకాలు రాశారు.

డాక్టర్ వీఆర్ రాసాని



ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ తెలుగు అధ్యాపకుడిగా పదవీ విరమణ పొందారు. కథ, నవల, నాటక రచయితగా ప్రసిద్ధులు. 1957లో పులిచెర్ల మండలం కురవపల్లెలో పుట్టారు. మెరవణి, పయనం, మాపూరి కథలు, మహాన్నుభావుడు మా నామాల సాయిబు వంటి కథా సంపుటాలు ప్రచురించారు. చీకటిరాజ్యం, పరస, స్వప్నజీవి, ఆదియోధుడు, ఏడోగ్రహం, వలస, ముద్ర, చీకటిముడులు, బతుకాట నవలలు రాశారు.

కంపల్లె రవిచంద్రన్



టీటీడీ సప్తగిరి మాసపత్రిలో ఉపసంపాదకుడిగా పనిచేస్తున్నారు. సినిమా రంగానికి సంబంధించి అనేక పుస్తకాలు రాశారు. కాశీఖండానికి సరళవచనం, మహాభారతోపన్యాసాలు (వ్యాససంపుటి), అంతా రామమయం సహృదయ రవిచంద్రిక, తిరుప్పావై - తిరువెంబావై వ్యాఖ్య, శ్రీకృష్ణశ్మరణం మమ, వల్లభాచార్య రచన సుమధురకు వ్యాఖ్య, వంగిపూడి పద్య కావ్యానికి గో కలాపం పేరుతో వ్యాఖ్య, సంకుసాల నృశింహ కవి కవికర్ణరయాసయానికి వ్యాఖ్య రాశారు.

డాక్టర్ ఎస్.ఉషారాణి

ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలో కూచిపూడి అధ్యాపకురాలిగా ఉన్నారు. యక్షగానంపై ప్రొఫెసర్ చిగిచెర్ల కృష్ణారెడ్డి పర్యవేక్షణలో 2004లో పరిశోధన చేశారు. దూరదర్శన్ ఏ-గ్రేడ్ ఆర్టిస్టుగా ఉన్నారు. ఎస్వీబీసీ ఛానల్‌లో అనేక కార్యక్రమాలకు కొరియోగ్రఫీ చేశారు. భగవద్గీత - నృత్య రీతి పుస్తకాన్ని రాశారు.



ద్వారం లక్ష్మి శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయ సంగీత, నృత్య విభాగంలో అధ్యాపకులుగా ఉన్నారు. కర్ణాటక, లలిత సంగీత, హిందూస్థానా భజన్స్ గానం చేయడంలో మేటి. పద్మశ్రీ ద్వారం వెంకటస్వామి నాయుడు మనుమరాలు ఈమె. సంగీత విద్యను పద్మవిభూషణ్ ఎంఎల్ వసంతకుమారి, పెమ్మరాజు సూర్యారావు వద్ద నేర్చుకున్నారు. దేశ, విదేశాల్లో నాలుగు వేలకు పైగా సంగీత కచేరీలు చేశారు.



కిరణ్‌క్రాంత్ చౌదరి శిల్ప కళపై డీ.లిట్ డిగ్రీ పూర్తి చేశారు. ఎస్వీయూ ఆర్కియాలజీ విభాగంలో ప్రొఫెసర్‌గా, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా, ఫ్యాకల్టీ డీన్‌గా, యూజీసీ ఎమిరటస్ ప్రొఫెసర్‌గా చేశారు. అనేక జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో కళా సంబంధమైన అంశాలపై పరిశోధనా పత్రాలు సమర్పించారు. ఇప్పటి వరకూ 18 పుస్తకాలు రాశారు. 9 పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. 120 వ్యాసాలు ప్రముఖ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి.



సాధుల మునిరత్నం

సంగీత కుటుంబ నేపథ్యం నుంచీ వచ్చారు. ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలో సంగీత రంగంలో డిప్లొమో చేశారు. 1993లో టీటీడీలో చేరి 30 ఏళ్లకు పైగా నాదస్వర విద్వాంసులుగా పనిచేశారు. నేషనల్ ఏ-గ్రేడ్ కళాకారులుగా గుర్తింపు పొందారు. గిన్నిస్ వరల్డ్ రికార్డు కూడా సృష్టించారు.



ప్రతిభకు పట్టం.. ఉగాది పురస్కారాలు



ఆకుల మల్లేశ్వరరావు: ఐబీఎస్ (ఇండియన్ బ్రాడ్ కాస్టింగ్ సర్వీస్)లో స్టేషన్ డైరెక్టర్ (ఏఐఆర్)లో పనిచేశారు. హిందీలో ఎంఏ, సంస్కృత ఆంగ్ల యోగాలో పీజీ డిప్లొమా పూర్తి చేశారు. హిందీ, తెలుగులో ఏడు పుస్తకాలను రచించారు.



ముని మల్లికార్జున: కర్ణాటిక్ మ్యూజిక్ డోలులో సర్టిఫికెట్ కోర్సు శ్రీపొట్టి శ్రీరాములు యూనివర్సిటీ నుంచి డిప్లొమా ఇన్ డోలు పూర్తి చేసి శ్రీకాళహస్తి ఆలయంలో భజంత్రిగా ఉన్నారు. ఆలిండియా రేడియో బి గ్రేడ్ ఆర్టిస్ట్‌గా గుర్తింపు పొందారు.



శ్రీవాణి ఎల్లా: టీటీడీ ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలో వీణ విభాగాధిపతి. ఆలిండియా రేడియో ఏ గ్రేడ్ ఆర్టిస్ట్‌గా గుర్తింపు పొందారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్‌లో బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నారు.



టి.పురుషోత్తమ నాయుడు.: ఎస్వీబీసీలో ఆధ్యాత్మిక విశేషాల విభాగంలో సీనియర్ ఏవీ రిపోర్టర్‌గా పనిచేస్తున్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న ఆలయాలపై వెయ్యికి పైగా కథనాలు రూపొందించి ప్రసారం చేశారు. తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి ఎంసీజే (జర్నలిజం)చేశారు. పీహెచ్‌డీని సైతం పూర్తి చేశారు.

- తిరుపతి(కల్చరల్), ఆంధ్రజ్యోతి

నేటి నుంచి రెండు ప్యాసింజర్ రైళ్ల రాకపోకల పునరుద్ధరణ

తిరుపతి(సెంట్రల్), మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి-కదిరి దేవరపల్లి, తిరుపతి-గుంతకల్ మధ్య గతంలో రాకపోకలు సాగిస్తున్న రెండు ప్యాసింజర్ రైళ్లను ఆదివారం నుంచి యధావిధిగా పునరుద్ధరించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. పాకాల, పీలేరు, ధర్మవరం, అనంతపురం మీదుగా రాకపోకలు సాగిస్తాయని వివరించారు.

అమ్మను కొట్టాడని..అన్నను చంపాడు



వెంకటరమణయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ చెంచుబాబు, సీఐ బాబీ

● కాపులూరులో ఘటన

నాయుడుపేట టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అమ్మను కొట్టాడన్న కోపంతో తమ్ముడు అన్న ప్రాణం తీసిన ఘటన నాయుడుపేట మండలం కాపులూరు గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు చెప్పిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సరోజనమ్మకు వెంకటరమణయ్య(50), బాబు కుమారులు. వెంకటరమణయ్య గ్రామంలోనే గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బాబు గూడూరులో కాపురముంటూ రోజూ గ్రామానికి వచ్చి పొలం పనులు చేసుకుని వెళుతుంటాడు. శుక్రవారం అర్ధరాత్రి మద్యం తాగి వచ్చిన వెంకటరమణయ్య భార్య మణెమ్మను కొడుతుండగా తల్లి సరోజనమ్మ అడ్డు వచ్చింది. దీంతో తల్లిని కూడా కొట్టాడు. అదే సమయంలో అక్కడున్న బాబు 'అమ్మను ఎందుకు కొడతావ్' అని నిలదీశాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆవేశానికి గురైన వెంకటరమణయ్య మచ్చుకత్తితో బాబుపై దాడి చేయడానికి ప్రయత్నించాడు. కత్తిని లాక్కున్న బాబు అన్న మెడపై వేటువేశాడు. వెంకటరమణయ్య అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. సమాచారం అందుకున్న డీఎస్పీ చెంచుబాబు, అర్బన్ సీఐ బాబీ అక్కడికి చేరుకుని మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆగమోక్తంగా శనీశ్వరస్వామికి పూజలు



శ్రీకాళహస్తి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనీశ్వరస్వామికి శనివారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. శనిగ్రహం కుంభరాశి నుంచి మీన రాశిలోకి ప్రవేశించడంతోపాటు ఉత్తరాబాద్ర నక్షత్రంతో కూడిన శనివారం, అమావాస్య కావడంతో స్వామివారికి విశేష అభిషేకాలు చేశారు. కలశ ప్రతిష్ఠ చేసి మొదట గణపతి పూజ, కలశపూజ చేశారు. అనంతరం స్వామివారికి నువ్వుల నూనె, మంచినూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. స్వామివారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించి, విశేష పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి దంపతులు, భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

గుట్టు వీడని విద్యార్థిని స్నేహ కేసు..!

తిరుపతి(నేరవిభాగం), మార్చి 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి బైరాగిపట్టెడలోని శ్రీచైతన్య టెక్నో స్కూలులో తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థిని స్నేహ కేసు గుట్టు వీడడంలేదు. ఈ విద్యార్థిని రెండవ అంతస్తు నుంచి కింద పడింది. ఈ ఘటనలో అమ్మాయి తలకు ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు పేర్కొంటున్నారు. మిద్దెపై నుంచి ఆమే పడి వుంటే కచ్చితంగా తలకు బలమైన గాయాలు అయ్యేవని డాక్టర్లు అంటున్నారు. సహచర విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణ కారణంగానే స్నేహను కొట్టి కింద పడేసి ఉంటారనే అందువల్లే కాళ్లకు, పొట్టభాగంలో ఘాయాలయ్యాయని అనుమనాలు ఉన్నాయి. పాఠశాలలో సీసీ కెమెరాలు లేకపోవడంతో దర్యాప్తు ముందుకు సాగడంలో ఆలస్యమవుతోందని పోలీసులు చెబు తున్నారు. పాఠశాలలో వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్న స్నేహ చిన్నాన్నతో పాటు సిబ్బందిని, సహచర విద్యార్థులను, చికిత్స పొందుతున్న స్నేహను ఎస్ఐ గిరిబాబు విచారించి స్టేట్‌మెంటు రికార్డు చేశారు. అయితే ఆ వివరాలు బయటకు పొక్కడంలేదు. అయితే బాధ్యులను త్వరలోనే గుర్తించి అరెస్టు చేస్తామని ఈస్ట్ పోలీసులు అంటున్నారు.

సాహిత్య, కళాస్రష్టలకు శ్రీవాణి ఉగాది పురస్కారాలు











శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి నుంచి పురస్కారాలు అందుకుంటున్న నరాల రామారెడ్డి, ఎస్వీ.రామారావు, డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి, రాణీ నాగశ్రీ శైలేశ్వరి, ప్రాస మణి

శ్రీసిటీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ రంగాలలో విశిష్ట ప్రతిభ కనబరచిన ప్రముఖులకు శ్రీసిటీలోని ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో శనివారం ఉగాది పురస్కారాలు ప్రదానం చేశారు. శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆధ్వర్యంలో శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఐదుగురికి ఉగాది పురస్కారాలు అందజేశారు. తెలుగు సాహిత్యం, అవధాన కళలలో డాక్టర్ నరాల రామారెడ్డి (ప్రొద్దుటూరు) సేవలను ప్రశంసిస్తూ ఆయనను సత్కరించారు. ఆలయ పునర్నిర్మాణం, చారిత్రక పరిశోధనల్లో విశేష కృషి చేసిన శిల్పకళా, పురావస్తు పరిశోధకులు, చరిత్రకారుడు స్థపతి డాక్టర్ ఈమని శివనాగిరెడ్డిని ఉగాది పురస్కారంతో సత్కరించారు. తెలుగు సినిమా వికాసానికి ఎస్వీ రామారావు చేసిన సేవలను అభినందిస్తూ శ్రీవాణి పురస్కారాన్ని అందజేశారు. ప్రఖ్యాత శాస్త్రీయ సంగీత విద్వాంసురాలు, రేడియో 'ఏ గ్రేడ్' కళాకారిణిగా గుర్తింపు కలిగిన పద్మావతి మహిళా యూనివర్శిటీ సంగీత శాఖాధ్యక్షురాలు డాక్టర్ రాణీ నాగశ్రీ శైలేశ్వరి శాస్త్రీయ సంగీత సంప్రదాయానికి చేసిన సేవలకు గుర్తింపుగా అవార్డు అందుకున్నారు. హాస్యభరిత, లయబద్ధ ప్రసంగాల దిట్ట, ప్రాసమణిగా పేరుగాంచిన అన్నదాత సుబ్రమణ్యేశ్వరరావు తన ప్రాస ప్రసంగంతో సభికులను ఆకట్టుకున్నారు. పురస్కార గ్రహీతల ప్రతిభా పాటవాలను రవీంద్ర సన్నారెడ్డి ప్రశంసించారు. ఆధ్యాత్మిక, సాహిత్య రంగాలలో శ్రీవాణి చేస్తున్న కృషిని వివరించారు. కార్యక్రమంలో పురస్కార గ్రహీతలను కోట రాజశేఖర్, ఆర్ఎం భాస్కర్, డాక్టర్ కే జగ్గారావు, డీ.ఝాన్సీ భైరి పార్థసారథి పరిచయం చేశారు. వ్యాఖ్యాతగా పల్లేటి బాలాజీ వ్యవహరించారు.

కాటేసిన కునుకు



కావడి శ్రీనివాసరెడ్డి (పాతచిత్రం)

● డివైడర్‌ను ఢీకొన్న కారు ● ఒకరి మృతి

● మరో ముగ్గురికి తీవ్రగాయాలు

శ్రీకాళహస్తి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): వారు నలుగురు మంచి స్నేహితులు. ఏటా ఉగాది రోజున తిరుమల శ్రీవారిని దర్శించుకోవడం ఆనవాయితీ. అదే ప్రకారం హైదరాబాద్ నుంచి కారులో తిరుమలకు పయనమయ్యారు. మార్గమధ్యంలో కునుకుపాటు వారిని కాటేసింది. కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఒకరు దుర్మరణం చెందగా.. ముగ్గురు తీవ్రగాయాలపాలయ్యారు. ఈ దుర్ఘటన శనివారం ఉదయం తొట్టంబేడు మండలం బసవయ్యపాళెం వద్ద పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. హైదరాబాద్ సమీపంలోని అబ్దుల్లాపూర్ పంచాయతీకి చెందిన కావడి శ్రీనివాసులరెడ్డి ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నారు. అదే పంచాయతీకి చెందిన మల్లారెడ్డి(55) పోస్టుమ్యాన్‌గా, భరత్‌కుమార్(45), బాల్‌రెడ్డి(45)లు రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఒకే గ్రామానికి చెందిన ఈ నలుగురు శుక్రవారం రాత్రి హైదరాబాద్ నుంచి తిరుమలకు కారులో బయలుదేరారు. శనివారం ఉదయం కారు అదుపు తప్పడంతో బసవయ్యపాళెం వద్ద జాతీయ రహదారి ఫ్లైఓవర్‌పై డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు నడుపుతున్న శ్రీనివాసులరెడ్డి వాహనంలోనే ఇరుక్కుని అక్కడికక్కడే మృతిచెందాడు. కారులో ఉన్న ముగ్గురు స్నేహితులు తీవ్రంగా గాయపడ్డారు. శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి పట్టణ శివారులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాసులరెడ్డి మృతదేహాన్ని వెలుపలకు తీసి ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.





తీవ్రంగా గాయపడిన బాలిరెడ్డి - ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తెలుగుజాతి గర్వించదగ్గ పార్టీ తెలుగుదేశం



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

● టీడీపీ ఆవిర్భావ దినోత్సవంలో నరసింహయాదవ్, శాప్ చైర్మన్

తిరుపతి(జీవకోన), మార్చి 29(ఆంధ్రజ్యోతి): తెలుగుజాతి గర్వించదగ్గ ఏకైక పార్టీ తెలుగుదేశం అని ఆ పార్టీ పార్లమెంటు అధ్యక్షులు, యాదవ సంక్షేమ అభివృద్ధి సంస్థ చైర్మన్ నరసింహయాదవ్, శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. టీడీపీ ఆవిర్భావ వేడుకలను నగర పరిధిలోని తిమ్మినాయుడుపాళెం వద్ద పెద్దఎత్తున నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేశారు. వారు మాట్లాడుతూ 1982లో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించి 9 నెలల కాలంలోనే అధికారంలోకి తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఎన్నో పథకాలను ప్రవేవపెట్టిన మహనీయుడని కొనియాడారు. నందమూరి తారక రామారావు ఆశయాలను చంద్రబాబు, నారా లోకేశ్ కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈ వేడుకల్లో టీడీపీ నాయకులు పులుగోరు మురళీకృష్ణారెడ్డి, జేబీ శ్రీనివాస్, ప్రణీత్, మహేష్‌యాదవ్, కుమారమ్మ, వెంకటరత్నం, సింగంశెట్టి సుబ్బరామయ్య, సుబ్బుయాదవ్, బీజీ కృష్ణయాదవ్, హేమంత్ రాయల్, గోల్ల మధుసూదన్‌నాయుడు, సుధాకర్, అంబూరు సింధూజ, నరేష్‌రెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, వెంకటేష్‌రెడ్డి, ధోని లోకయాదవ్, వెంకటాద్రియాదవ్, బాల, అయ్యప్ప, దొరైరాజు, శ్రీనివాస్‌యాదవ్, అక్కినపల్లి లక్ష్మయ్య, చందు చౌదరి పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు భేష్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలు భేష్‌గా ఉందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ఉపాధిహామీ పథకం 2024-25 అమలుతో జిల్లాలో సాధించిన ప్రగతి, ప్రణాళికలపై కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది జిల్లాలో రూ.1.72లక్షల కుటుంబాలకు ఉపాధి కల్పించామన్నారు. ఈ పథకంలో అన్ని రకాల పనులకు గాను కూలీలకు రూ.260కోట్లు వేతనాల రూపంలో చెల్లించామన్నారు. 4,853 చెరువుల్లో పూడికతీత, పునరుద్ధరణ పనులుచేపట్టి 450కోట్ల లీటర్ల నీటిని భూమిలోకి ఇంకింపజేశామన్నారు. సన్నకారు, చిన్నకారు రైతుల పొలాల్లో 1,064 పంటకుంటలు, 803 పొలాల్లో కందకాలు, 1,920 కిలోమీటర్ల పంటకాలువ పూడికతీత పనులు జరిగాయన్నారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కల పెంపకం, 1,211 ఎకరాల పండ్లతోటల పెంపకం చేపట్టినట్లు వివరించారు. రూ.20కోట్లతో చిన్నకారు రైతుల పశువులకు షెడ్లు నిర్మించామన్నారు. గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా తారు, మెటల్ రోడ్లు వేశామన్నారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

నకిలీ పట్టాల బాగోతంపై చర్యలు తీసుకోండి

- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం-

రేణిగుంట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న ఇంటి పట్టాలను నకిలీ చేసి విక్రయించిన అప్పటి రెవెన్యూ అధికారి, ప్రైవేటు కంప్యూటర్ ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాలని తిరుపతి సత్యనారాయణపురానికి చెందిన బుజ్జమ్మ 2022లో రేణిగుంట అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా పోలీసులు కేసు నమోదు చేసి చర్యలు తీసుకోకపోవడంతో బాధితురాలు హైకోర్టును ఆశ్రయించారు. స్పందించిన హైకోర్టు అప్పటి రెవెన్యూ అధికారులపై ప్రభుత్వం విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఈ నెల 7వ తేదీన ఆదేశాలు జారీ చేయగా, శనివారం వాట్సాప్ గ్రూపులో హైకోర్టు ప్రొసీడింగ్స్, పోలీస్ ఎఫ్ఐఆర్ కాపీ హల్‌చల్ చేశాయి.

సీబీఎస్‌లో ఉగాది రద్దీ



తిరుపతి(ఆర్టీసీ), మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఉగాది, రంజాన్ పర్వదినాల సెలవులతో పాటు వారాంతం కలసిరావడంతో ఒక్కసారిగా సెంట్రల్ బస్సు స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ పెరిగింది. గ్రామాలకు వెళ్లేవారు, అక్కడి నుంచి నగరానికి వచ్చేవారితో అన్ని ప్లాట్‌ఫామ్స్ కళకళలాడాయి. ముఖ్యంగా పల్లెవెలుగు బస్టాండులో మరింత ఎక్కువ రద్దీ కనిపించింది. ఏడుకొండల బస్టాండు శ్రీవారి భక్తులతో కిటకిటలాడింది. రద్దీకి అనుగుణంగా బస్సులు అందుబాటులో లేకపోవడంతో నిరీక్షణ తప్పలేదు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సీట్ల కోసం పాట్లు పడ్డారు. ఆర్టీసీ వారు అదనపు సర్వీసులు ఏర్పాటు చేసి ఉంటే బావుండేదని ప్రయాణికులు చర్చించుకోవడం వినిపించింది.



ఉగాది వేడుకలకు ముస్తాబైన కాణిపాకం



విద్యుద్దీపాలంకరణలో మిరుమిట్లు గొలుపుతున్న ఆలయం

ఐరాల(కాణిపాకం), మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం.. ఆదివారం నిర్వహించనున్న ఉగాది వేడుకలకు ముస్తాబైంది. వరసిద్ధుడి ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలు, విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసే అవకాశం ఉండటంతో అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. ఉదయం ఆలయంలోని కల్యాణ వేదిక వద్ద పంచాంగ శ్రవణం నిర్వహించనున్నట్లు ఈవో పెంచలకిషోర్ తెలిపారు. అనంతరం ఉగాది పచ్చడిని భక్తులకు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది జిల్లాలో రైతులకు శుభం జరగాలని వరసిద్ధుడిని కోరుకున్నట్లు వివరించారు.

ఒకేషనల్ పరీక్షకు 38 మంది గైర్హాజరు

చిత్తూరు సెంట్రల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా శనివారం జిల్లా వ్యాప్తంగా 41 కేంద్రాల్లో ఒకేషనల్ పరీక్షలు నిర్వహించినట్లు డీఈవో వరలక్ష్మి, పరీక్షల సహాయ కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. 3713 మంది విద్యార్థులకు 3675 మంది హాజరవగా, 38 మంది గైర్హాజరైనట్లు డీఈవో తెలిపారు. డీఈవో మూడు కేంద్రాలు, 12 ఫ్లయింగ్ స్క్వాడ్లు 30 కేంద్రాలు తనిఖీలు చేయగా, 37 కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్లు విధులు నిర్వహించినట్లు తెలిపారు.

ఈవీఎం గోదాము పరిశీలన



ఈవీఎం గోదామును పరిశీలిస్తున్న కలెక్టర్ తదితరులు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు సంబంధించిన ఈవీఎంలను భద్రపరిచిన గోదాములను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ శనివారం పరిశీలించారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలన జరిపారు. గోదాముల వద్ద 24 గంటలపాటు భద్రత పటిష్ఠంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో మోహన్‌కుమార్, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ వాసుదేవన్, వివిధ పార్టీల ప్రతినిధులు సురేంద్రకుమార్ (టీడీపీ), అట్లూరి శ్రీనివాసులు (బీజేపీ), దేవినేని యశ్వంత్ (జనసేన), ఉదయ్‌కుమార్ (వైసీపీ), పరదేశి (కాంగ్రెస్), గంగరాజు (కాంగ్రెస్), ఎన్నికల విభాగ కలెక్టరేట్ అధికారులు మనోజ్‌కుమార్, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లుండి టెన్త్ సోషల్ స్టడీస్ పరీక్ష

చిత్తూరు సెంట్రల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): టెన్త్ పరీక్షల్లో భాగంగా సోమవారం జరగాల్సిన సోషల్ స్టడీస్ పరీక్షను రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు ఏప్రిల్ ఒకటో తేదీన నిర్వహించనున్నట్లు డీఈవో వరలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 31వ తేదీ రంజాన్ పండుగను ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించడంతో ఆ రోజున జరగాల్సిన సోషల్ స్టడీస్ పరీక్షను మంగళవారానికి మార్పు చేసినట్లు పేర్కొన్నారు. ఈ మార్పును విద్యార్థులు గమనించాలని సూచించారు.

లక్ష్యాన్ని అధిగమించిన గనులశాఖ

చిత్తూరు సెంట్రల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి జిల్లా గనులశాఖకు నిర్దేశించిన లక్ష్యం పూర్తి చేసి.. మరింత ఆదాయం సమకూర్చే దిశగా వెళుతోంది. గనుల శాఖ ద్వారా వచ్చే ఆదాయాన్ని గత ప్రభుత్వం ప్రైవేటు సంస్థకు అప్పగించిన విషయం తెలిసిందే. సంస్థ గడువు ముగియడంతో సీనరేజ్ (ఆదాయం) వసూలు బాధ్యతలను ప్రభుత్వం గనులు, భూగర్భశాఖకు అప్పగించింది. దీంతో వార్షిక ఆదాయ లక్ష్యం రూ.146.90 కోట్లు కాగా, లక్ష్యాన్ని మించి ఇప్పటి వరకు రూ.161.75 కోట్లు వసూలు చేశారు. సీనరేజ్ వసూలు గడువు నెలాఖరు వరకు ఉండటంతో మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు గనుల శాఖ డీడీ సత్యనారాయణ తెలిపారు. జిల్లాలో బ్లాక్, కలర్ గ్రానైట్, రోడ్డు మెటల్, బిల్డింగ్ స్టోన్, గ్రావెల్స్ యూనిట్లు 206 ఉన్నాయన్నారు. యూనిట్ల వారీగా.. బ్లాక్ గ్రానైట్ 87, కలర్ గ్రానైట్ 83, రోడ్డు మెటల్ 35, బిల్డింగ్ స్టోన్ ఒకటి ఉన్నాయని తెలిపారు. వీటి నుంచి సీనరేజ్ వసూలు ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చినట్లు డీడీ తెలిపారు.

నేడు, రేపు రిజిస్ట్రేషన్ కార్యాలయాలు పనిచేస్తాయి : డీఆర్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాలతో స్టాంపులశాఖ కమిషనర్ సూచనలమేరకు సెలవు రోజులైన ఆది, సోమవారాలను పనిదినాలుగా ప్రకటించినట్లు జిల్లా రిజిస్ట్రార్ ఎ.రమణమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండ్రోజులు జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్, జిల్లా రిజిస్ట్రార్, డీఐజీ కార్యాలయాలు యథావిధిగా ఉదయం 11 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పనిచేస్తాయన్నారు. కక్షిదారులు ప్రభుత్వం కల్పించిన ఈ సౌకర్యాన్ని గుర్తించి రిజిస్ట్రేషన్ సేవలు వినియోగించుకోవాలని కోరారు. ఏప్రిల్ రెండో తేదీనుంచి చిత్తూరు ఆర్వో, చిత్తూరు ఎస్సార్వో కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ పద్ధతిలో రిజిస్ట్రేషన్లు ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు.

పాడి, కోళ్ల రంగ పరిశ్రమల అభివృద్ధికి చర్యలు: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పాల ఉత్పత్తిలో రాష్ట్రస్థాయిలో జిల్లా ప్రథమస్థానంలో ఉందని.. ఈ రంగాన్ని మరింత అభివృద్ధి చేయడానికి అధికారులు పనిచేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఎన్ఈసీసీ (నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ), పశుసంవర్ధకశాఖ అధికారులు, సభ్యులతో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడిరంగం అభివృద్ధిలో భాగంగా పశువుల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే కోళ్ల రంగాన్ని అభివృద్ధి చేసి, ఉపాధి అవకాశాల పెంపునకు చర్యలు చేపడతామని చెప్పారు. పశుసంవర్ధకశాఖ జేడీ ఆరిఫ్, నెక్ చైర్మన్ రమేష్ బాబు, బాలాజి హేచరీస్ డైరెక్టర్ పునీత్, రామకృష్ణ, రాజమోహన్, సూర్యనారాయణ, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

6 మండలాల్లో 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. శనివారం ఆరు మండలాల్లో 40 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తవణంపల్లెలో 41.1డిగ్రీలు, నగరిలో 40.5, పులిచెర్ల, పూతలపట్టు, శ్రీరంగరాజపురం, వెదురుకుప్పం మండలాల్లో 40.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నింద్రలో 39.9డిగ్రీలు, చిత్తూరులో 39.3, గుడుపల్లి, గుడిపాల, శాంతిపురం, సదుం మండలాల్లో 39, పలమనేరులో 38.8, రొంపిచెర్ల, సోమల మండలాల్లో 38.7, ఐరాల, పెనుమూరు, విజయపురం మండలాల్లో 38.6, పాలసముద్రంలో 38.5, యాదమరిలో 38.1, బంగారుపాళ్యం, గంగవరం మండలాల్లో 38, వి.కోటలో 37.9, పెద్దపంజాణిలో 37.3, కుప్పంలో 36.5, బైరెడ్డిపల్లిలో 36.4, కార్వేటినగరంలో 36.2, రామకుప్పంలో 35.9, పుంగనూరులో 35.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



టీడీపీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా చిత్తూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న పార్టీ నేతలు

తెలుగు తమ్ముళ్ల అత్యుత్సాహం

వెదురుకుప్పం, మార్చి 29(ఆంధ్రజ్యోతి):తెలుగు తమ్ముళ్ల ఉత్సాహం వెదురుకుప్పం మండలంలో దుమారం రేపింది.టీడీపీ ఆవిర్భావ దినోత్సవాల్లో భాగంగా ఏకంగా గొడుగు చింత పంచాయతీ కార్యాలయంపై ఉదయం టీడీపీ జెండాను ఎగుర వేశారు.ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మధ్యాహ్నం పైన కార్యకర్తలే తొలగించారు.



పుంగనూరు కేక్ కట్ చేసిన చంద్రబాబు



పుంగనూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి):టీడీపీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పుంగనూరు అపూర్వ బేకరీ కేక్‌ను శనివారం విజయవాడలో పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు కట్ చేశారు. పుంగనూరు మైనార్టీ నేత ఖాదర్‌బాషాకు తినిపించారు.పుంగనూరు పట్టణానికి చెందిన అపూర్వ బేకరి యజమాని షాద్‌బాషా మాట్లాడుతూ 1996 నుంచి ఏటా పార్టీ ఆవిర్భావ దినం, సీఎం చంద్రబాబు జన్మదినం, రంజాన్‌పండుగ, ఎన్టీఆర్ జన్మదినం రోజున పుంగనూరు నుంచి పార్టీ కార్యాలయానికి కేక్ పంపుతున్నట్లు తెలిపారు.

ఫ్యాక్టరీ యాజమాన్యం నుంచి రూ.2కోట్ల బకాయిలు ఇప్పించండి

కలెక్టర్‌కు మామిడి రైతుల వినతి

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): 'శ్రీరంగరాజపురం మండలం పిళ్లారికుప్పంలోని వెజ్ బై నేచర్ ఫుడ్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ యాజమాన్యం రైతులకు రూ.2కోట్ల చెల్లింపుల్లో జాప్యం చేస్తోంది. ఈ బకాయిలను వడ్డీతోసహా చెల్లించేలా చర్యలు తీసుకోవాలి' అని చిత్తూరు మ్యాంగో ప్రొడ్యూసర్స్ కంపెనీ డైరెక్టర్ కోదండయ్య, చైర్మన్ వల్లేరు మునిచంద్ర నాయుడు, ఇతర డైరెక్టర్లతో కలిసి కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. 2023 మ్యాంగో సీజన్‌లో పల్ప్ తయారీకోసం ఫ్యాక్టరీకి రైతులు మామిడి కాయలను అందజేశారని తెలిపారు. బిల్లులు చెల్లించని కారణంగా రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని చెప్పారు.



కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మామిడి రైతులు

ఆక్సిజన్ గ్యాస్ లారీని ఢీకొన్న కంటైనర్

కంటైనర్ డ్రైవర్‌కు తీవ్రగాయాలు

బంగారుపాళ్యం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న ఆక్సిజన్ గ్యాస్ లారీని కంటైనర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో కంటైనర్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. మహారాష్ట్ర బారామతి నుంచి ఆటోల లోడుతో ఓ కంటైనర్ కాంచీపురానికి వెళుతోంది. శనివారం ఉదయం చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై బోడబండ్ల బస్టాప్ వద్దకొచ్చేసరికి మరమ్మతులకు గురై ఆగి ఉన్న ఆక్సిజన్ గ్యాస్ లారీని వెనుక వైపు నుంచి కంటైనర్ ప్రమాదవశాత్తూ ఢీకొట్టింది. ఒక్కసారిగా మంటలు చెలరేగి వాహనాలకు అంటుకున్నాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. కంటైనర్ డ్రైవర్ మహారాష్ట్రకు చెందిన డగాడ్‌జాదవ్‌ను మంటల నుంచి అతి కష్టంపై తప్పించారు. అప్పటికే అతను తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



దగ్ధమవుతున్న వాహనాలు

రహదారుల మరమ్మతులకు రూ.19.40కోట్ల మంజూరు

జిల్లా మేజరు రోడ్లకు రూ.6.30కోట్లు ● రాష్ట్ర హైవేలకు రూ.13.10కోట్లు

చిత్తూరు (గాంధీసర్కిల్), మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలో రహదారుల మరమ్మతుకు రూ.19.40కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో రాష్ట్ర హైవేలకు రూ.13.10కోట్లు, మేజర్ జిల్లా రోడ్లకు రూ.6.30కోట్లు వంతున కేటాయించారు. రాష్ట్ర హైవేలకు సంబంధించి పరిశీలిస్తే... పలమనేరు నియోజకవర్గంలో పలమనేరు- గుడియాత్తం రహదారి 3కి.మీ. నిర్మాణానికి రూ.1.80కోట్లు, పలమనేరు- బైరెడ్డిపల్లె మధ్య 6.30కి.మీ. నిర్మాణానికి రూ.4.50కోట్లు, చిత్తూరు- గుడియాత్తం మధ్య 5కి.మీ. దూరానికి రూ.2.50కోట్లు, నగరి నియోజకవర్గంలో నగరి-నాగలాపురం మధ్య 8.60కి.మీ. నిర్మాణానికి రూ.4.30కోట్లు మంజూరు చేశారు. జిల్లా మేజరు రోడ్ల విషయానికి వస్తే.. కుప్పం నియోజకవర్గ పరిధిలో గోవిందపల్లె-దండికుప్పం (వయా శివరామపురం)రోడ్డుకు 7.25కి.మీ.కు రూ.2.10కోట్లు, కంచనబల్ల-రామకుప్పం (వయా సింగసముద్రం)రోడ్డుకు 9.92కి.మీ.కు రూ.2.40కోట్లు, పలమనేరు నియోజకవర్గంలో నలగాంపల్లె-కేబీఎన్ కండ్రిగ రోడ్డుకు 5.96కి.మీ.కు రూ.180కోట్లు మంజూరు చేశారు.

డోలు విద్వాంసుడు పద్మనాభానికి కళారత్న పురస్కారం



రామకుప్పం, మార్చి 29(ఆంధ్రజ్యోతి):ఉగాదిని పురస్కరించుకుని రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన కళారత్న పురస్కారానికి రామకుప్పం మండలం బందార్లపల్లెకు చెందిన డోలు విద్వాంసుడు పద్మనాభం ఎంపిక య్యారు. ఆదివారం అమరావతిలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఈ పురస్కారం ఆయన అందుకోనున్నారు.పదిహేనేళ్ళుగా తన తండ్రి వెంకటేశ్ నుంచి వారసత్వంగా అందిపుచ్చుకున్న డోలు వాయిద్యంలో ఈయన ప్రతిభ కనబరుస్తున్నారు.దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఆయన కచేరీలు నిర్వహించారు. విశాఖలో ఆంధ్రరత్న అవార్డు అందుకున్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం సమక్షంలో కచేరీ నిర్వహించి శభాష్ అనిపించుకున్నారు.

నేడు, రేపు జీఎస్టీ రిటర్న్‌లను దాఖలు చేయొచ్చు

చిత్తూరు రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సెలవులైన ఆది, సోమవారాల్లో జీఎస్టీ రిటర్న్‌లను దాఖలు చేయవచ్చునని చిత్తూరు వాణిజ్య పన్ను శాఖ జాయింట్ కమిషనర్ జాన్ స్టీవెన్‌సన్ ఒక ప్రకటనలో తెలిపారు. రిటర్న్‌లు దాఖలు, రిటర్న్‌లను డిఫాల్ట్ చేస్తే పన్ను చెల్లింపుదారులకు ఆలస్య రుసుం, వడ్డీ విధిస్తారని పేర్కొన్నారు.

జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలందరికీ విశ్వావసునామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆశీస్సులతో అందరి జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని కోరుకున్నారు. అలాగే శుభాకాంక్షలు తెలిపిన వారిలో.. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి, ఎస్పీ మణికంఠ, డీఆర్వో మోహన్, ప్రభుత్వ విప్‌లు శ్రీకాంత్, థామస్, ఎమ్మెల్యేలు ఉన్నారు.

రేపటి 'పీజీఆర్ఎస్' రద్దు

చిత్తూరు అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండగను పురస్కరించుకుని సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యలపై వ్యయప్రయాసలు కోర్చి జిల్లా కేంద్రానికి రావద్దని ఆ ప్రకటనలో కోరారు.

తాగునీటి ఎద్దడి రానివ్వకండి : జడ్పీ సీఈవో

చిత్తూరు రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏ మండలంలో కూడా తాగునీటి ఎద్దడి రానివ్వకుండా చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు ఆదేశించారు. శనివారం జడ్పీ సమావేశ మందిరంలో ఏవోలతో సమావేశం నిర్వహించారు. మండలంలో జరిగే ప్రతి అభివృద్ధి పని వివరాలను పక్కగా రికార్డు చేయాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను ప్రణాళిక బద్ధంగా పూర్తి చేయాలని చెప్పారు.

నలుగురు వీఆర్వోల సస్పెన్షన్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించి, వాస్తవాలను దాచిన నలుగురు వీఆర్వోలను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. రెవిన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యల్లో పరిష్కారమైన అర్జీదారుల స్పందనను ప్రభుత్వ సూచనల మేరకు ఐవీఆర్ఎస్ ద్వారా సేకరిస్తుంది. సమాచార సేకరణలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులందడంతో కలెక్టర్ క్షేత్రస్థాయిలో విచారణకు ఆదేశించారు.ఫిర్యాదులో కనబరిచిన విషయాలు వాస్తవాలని తెలియడంతో ఇందుకు నలుగురు వీఆర్వోలు బాధ్యులని కలెక్టర్ గుర్తించారు.బైరెడ్డిపల్లి మండలం లక్కనపల్లికి చెందిన వీఆర్వో, శ్రీరంగరాజపురం మండలం నెలవాయి వీఆర్వో, గంగవరం మండలం గండ్రాజుపల్లి వీఆర్వో, నింద్ర మండలం అగరంకు చెందిన వీఆర్వోలను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

తులసినాథానికి ఉగాది పురస్కారం



పలమనేరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఉగాది సందర్భంగా రాష్ట్రప్రభుత్వం అందించే ఉగాది పురస్కారానికి పలమనేరుకు చెందిన పి. తులసినాథంనాయుడు ఎంపికయ్యారు.ఉపాధ్యాయ వృత్తిలో వుంటూ దశాబ్ద కాలంగా తులసినాథం నాయుడు, ఆయన సతీమణి పుష్ప తెలుగు భాషాభిమానంతో పలు సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పలమనేరులో సొంత నిధులతో సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు కళామందిరం నిర్మించారు.తెలుగు సాహిత్యసాంస్కృతిక సమితి ఏర్పాటు చేసి సాహితీ సేవలందిస్తున్నారు. సుమతి, వేమన పద్యపుస్తకాలను సొంత డబ్బులతో ముద్రించి వేలాదిమంది విద్యార్థులకు పంచిపెడుతున్నారు.

ఉగాది వేడుకలకు రూ.20 లక్షల మంజూరు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి29 (ఆంధ్రజ్యోతి): పంచాంగ శ్రవణం, కవిసమ్మేళనం, రచయితలకు సత్కారం, శాస్త్రీయ నృత్యాల ప్రదర్శన, తెలుగుదనం ఉట్టిపడేలా సాంప్రదాయ దుస్తులతో అధికారులు, ప్రజలు.... పచ్చనితోరణాలతో వేదిక... ఇలా ఒక్కటేంటి ఉగాది అంటే తెలుగుదనం ఉట్టిపడుతుంది. ఐదేళ్ళ అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ఉగాది పండుగ నిర్వహణను అటకెక్కించింది.ఆరేళ్ళ అనంతరం ప్రస్తుత ప్రభుత్వం ఉగాది పండుగ ప్రాముఖ్యతను గుర్తించి ప్రభుత్వకార్యక్రమంగా ఘనంగా నిర్వహించాలని ఆదేశించింది. ఇందుకోసం రూ.20లక్షలు కేటాయించింది.చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ వేడుకలు నిర్వహించనున్నారు. పంచాంగ శ్రవణం, కవిసమ్మేళనం, ప్రముఖ వ్యక్తులకు సత్కారాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నైపుణ్యాలు పెంచుకుంటే మెరుగైన ఉపాధి

మహిళలకు కలెక్టర్ సూచన

చిత్తూరు సెంట్రల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాలు పెంచుకుంటే మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని మహిళలకు కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో శనివారం ఈస్ట్‌మన్ ఎక్స్‌పోర్ట్ క్లోథింగ్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థలో పనిచేయడానికి టైలరింగ్ శిక్షణపై చిత్తూరు రూరల్, అర్బన్, గుడిపాల, బంగారుపాళ్యం మండలాల స్వయం సహాయక సంఘాల మహిళలకు ఒక్క రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళలకు ఉపాధి కల్పించడానికి గార్మెంట్ కంపెనీ ముందుకు రావడం అభినందనీయమన్నారు. మహిళా పారిశ్రామికవేత సుధారాణి మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి సీఎం చంద్రబాబు పెట్టపీట వేశారని చెప్పారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, సంస్థ ప్రతినిధి మోహద్దీన్, మెప్మా పీడీ రవీంద్ర, జీఎం డీఐసీ సూరిబాబు, ఏపీఐఐసీ జడ్ఎం సుబ్బారావు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థి అదృశ్యం



మంజునాథ్

బంగారుపాళ్యం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఉంటున్న జి.మంజునాథ్(13) అదృశ్యమయ్యాడు. ఈ బాలుడు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం సహచర విద్యార్థులతో కలిసి పాఠశాలకు వెళ్లాడు. సాయంత్రమైనా వసతి గృహానికి రాకపోవడంతో వార్డెన్ వినాయకం మండల పరిసరాల్లో వెతికినా ప్రయోజనం లేకపోయింది. దీంతో ఈ విషయాన్ని పలమనేరు మండలం వడ్డూరులో ఉంటున్న తల్లిదండ్రులకు తెలిపారు. శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మల్లప్ప తెలిపారు.

చంద్రబాబు పాలనపై నమ్మకంతోనే పార్టీలో చేరికలు



ఎంపీపీ సులోచనను సత్కరిస్తున్న గౌనివారి తదితరులు

రామకుప్పం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షానికి చెందిన ప్రజాప్రతినిధులను ప్రలోభాలు, బెదిరింపులకు గురి చేసి పార్టీలోకి తీసుకోవాల్సిన అవసరం టీడీపీకి లేదని మాజీ ఎమ్మెల్సీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు స్పష్టం చేశారు. శనివారం ఆయన స్థానిక నేతలతో కలిసి రామకుప్పం ఎంపీపీగా ఎన్నికైన సులోచన, వైస్‌ఎంపీపీ వెంకట్రామగౌడులను ఆయన అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనపై విసిగిపోయి, చంద్రబాబు పరిపాలన దక్షతపై నమ్మకంతో అభివృద్ధిని కాంక్షిస్తూ ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు టీడీపీలోకి చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, నేతలు రామ్మూర్తి, శ్రీనివాసులురెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సత్తి, వీరనాగపురం నాగరాజు, బాలరాజు, మంజునాథ్, అల్లీశీన తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రైతు సంఘం అధ్యక్షుడికి ఉగాది పురస్కారం



ఉమాపతినాయుడుకు జ్ఞాపికను అందజేస్తున్న జడ్పీచైర్మన్ శ్రీనివాసులు

పలమనేరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వి.కోటలో శనివారం ఉగాది పండుగను పురస్కరించుకుని కళాభారతి ఫౌండేషన్, గురజాడ ఫౌండేషన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షులు ఉమాపతినాయుడును ఘనంగా సన్మానించారు. జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు ఉమాపతినాయుడుకు శాలువకప్పి జ్ఞాపికను అందించారు. కళాభారతి ఫౌండేషన్, గురజాడ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఉగాది పురస్కార కార్యక్రమంలో ఉమాపతి నాయుడును సన్మానించారు.

సదుం పంచాయతీ వనరుల బహిరంగ వేలం

● రూ.11.69 లక్షల ఆదాయం



వేలంలో పాల్గొన్న పంచాయతీ సిబ్బంది

సదుం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను సదుం మేజర్ పంచాయతీలోని వనరుల బహిరంగ వేలం డీఎల్‌పీవో పార్వతి ఆధ్వర్యంలో శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. వేలంలో వారపు సంత రూ.9.05 లక్షలు, ప్రైవేటు బస్టాండు రూ.77 వేలు, దినసరి మార్కెట్ రూ.65 వేలు, పూల మార్కెట్ రూ.1.18 లక్షలు, జంతు వధశాల రూ.36 వేలకు దక్కించుకున్నారు. మొత్తం రూ.11.69 లక్షలు ఆదాయం ఆదాయం సమకూరినట్లు పంచాయతీ ఈవో హసీనా తెలిపారు.

కోటేశ్వరరావుకు టీడీపీ శాశ్వత సభ్యత్వం



టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకుంటున్న కోటేశ్వరరావు

శాంతిపురం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండల టీడీపీ నాయకులు కోటేశ్వరరావు పార్టీ కార్యాలయంలో శనివారం మండల పార్టీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడుకు రూ.లక్ష చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరిపాలనా విధానం నచ్చడంతో పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నానని కోటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు నాగరాజు, గోపాల్ యుగంధర్, రమేష్ పాల్గొన్నారు.

దుప్పుల దాడులతో టమోటా తోటల ధ్వంసం

సోమల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సోమల పంచాయతీ ఎగువకుంట సమీపంలోని సోమశేఖర్, శంకర్, మదన్‌మోహన్ టమోటా తోటల్లో శుక్రవారం రాత్రి దుప్పులు సంచరించి టమోటా తోటలను ధ్వంసం చేసినట్లు బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మరో వైపు అడవి పందులు, నెమళ్లు వేరుశనగ పంట పొలాలను నష్ట పరుస్తున్నాయని వాపోతున్నారు. సోమల, కందూరు, తమ్మినాయనపల్లె, మిట్టపల్లెలో వన్యప్రాణుల దాడులతో రైతులు ఆందోళనలో పడ్డారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

పౌరుల హక్కులకు ప్రభుత్వం భరోసా



మాట్లాడుతున్న తహసీల్దారు చిట్టిబాబు

కుప్పం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పౌరుల హక్కులకు ప్రభుత్వం భరోసా ఇస్తోందని కుప్పం మండల తహసీల్దారు చిట్టిబాబు అన్నారు. కుప్పం మండలం బోడగుట్టపల్లె గ్రామంలో శనివారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దారు మాట్లాడుతూ రాజ్యాంగం ప్రసాదించిన హక్కులకు భంగం కలిగితే సంబంధిత అధికారులకు పౌరులు ఫిర్యాదు చేయవచ్చన్నారు. విచారించి న్యాయం జరిగేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు మండల స్థాయి అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ వితరణ



హెచ్‌ఎంకు ప్రింటర్ అందిస్తున్న కంపెనీ ప్రతినిధి

కుప్పం రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం ములకలపల్లె ఎంపీపీ పాఠశాలకు సార్వభౌమ గ్రూప్ ఆఫ్ కంపెనీ కెనాన్ ప్రింటర్‌ను వితరణ చేసింది. ఈ ప్రింటర్‌ను కంపెనీ ప్రతినిధులు పాఠశాల హెచ్‌ఎంకు శనివారం అందించారు. కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ అధ్యక్షుడు మురళీ, నాయకులు రమేశ్, మునిబాబు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న బీసీఎన్ తదితరులు

కుప్పం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): బీసీఎన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని కుప్పంలోని పేద ముస్లిం కుటుంబాలకు శనివారం రంజాన్ తోఫా పంపిణీ చేశారు. పేద ముస్లిం కుటుంబాలు రంజాన్ పర్వాన్ని సంతోషంగా జరుపుకోవాలన్న ఆశయంతో ఈ తోఫా పంపిణీ చేసినట్లు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బీసీ.నాగరాజ్ తెలిపారు. ముస్లింలకు ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కేడీసీ చైర్‌పర్సన్ శాంతా నాగరాజ్, కేఈసీ వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సునీల్‌రాజ్, సీఈవో సాగర్ రాజ్ పాల్గొన్నారు.

అదనపు విద్యుత్తు లోడ్‌కు దరఖాస్తు చేసుకోండి

చౌడేపల్లె, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గృహాలకు అదనపు విద్యుత్ లోడ్ కోసం రాయితీతో దరఖాస్తు చేసుకోవాలని ఏపీ ట్రాన్స్‌కో ఏఈ శశిధర్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ 50 శాతం రాయితీతో గృహాలకు అదనపు విద్యుత్ లోడ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. జూన్ 30లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన పెద్దపంజాణి ఎస్.ఐ

పలమనేరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పెద్దపంజాణి ఎస్.ఐగా బదిలీపై వచ్చి బాధ్యతలు తీసుకున్న ధనంజయరెడ్డి శనివారం పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి పెద్దపంజాణిలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

ఒకేషనల్ కోర్సు పరీక్షకు 153 మంది హాజరు

పలమనేరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో పదో తరగతి పరీక్షల్లో భాగంగా ఎనిమిదో రోజు శనివారం నిర్వహించిన ఒకేషనల్ పరీక్షకు 153 మంది హాజరయ్యారని మండల విద్యాశాఖ అధికారులు లీలారాణి, బాలసుందరం తెలిపారు. కేవలం 6 మంది మాత్రమే గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. పరీక్షలు రాసేందుకు వచ్చిన విద్యార్థులకు వసతులు కల్పించామని తెలిపారు.

కొండతిమ్మనపల్లెలో పారిశుధ్య పనులు చేపట్టాలి



సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీడీవో ఏపీఆర్ కుమార్

శాంతిపురం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కొండతిమ్మనపల్లె ఎన్టీఆర్ కాలనీలో పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీడీవో ఏపీఆర్ కుమార్ పంచాయతీ అధికారులను ఆదేశించారు. కాలనీలో నెలకొన్న సమస్యలను గత వారం ఎంపీడీవో కుమార్‌కు విన్నవించారు. స్పందించిన ఆయన శనివారం కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి సుమయాను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న గృహాలకు వెంటనే బిల్లులు మంజూరు అయ్యేలా చర్యలు చేపడుతామని కాలనీవాసులకు ఎంపీడీవో హామీ ఇచ్చారు. ఆయన వెంట పంచాయతీ అధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

అమ్మఒడిపై అవగాహన కల్పించాలి



అమ్మఒడిపై అవగాహన కల్పిస్తున్న మధుసూదన్ ఆచారి

పుంగనూరు రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అమ్మఒడి కార్యక్రమంపై అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బందికి ఏరియా ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ మధుసూదన్ ఆచారి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆస్పత్రి ఆవరణలో గర్భిణులు, బాలింతలకు, అభాగ్యులకు అమ్మఒడిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అయేషా నస్రీన్‌తాజ్, నర్సింగ్ సూపర్‌వైజర్ భారతి, స్టాఫ్‌నర్సు మధుబాల, సుజాత, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రేమకుమారి, సరళ, విజయ, ఉమ, మసూద, రాధ, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం



పలమనేరులో ...



సోమలలో..



చౌడేపల్లెలో ...

కుప్పం/కుప్పం రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కుప్పం మున్సిపాలిటీ, కుప్పం మండలాలలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. కుప్పం పట్టణంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద జరిగిన వేడుకల్లో ముఖ్యమంత్రి, పార్టీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పాల్గొని పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళులర్పించారు. పురపాలక సంఘంలోని పలు వార్డుల్లో ఆయా వార్డు కౌన్సిలర్లు, పార్టీ ఇన్‌చార్జిల నేతృత్వంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి.

● పలమనేరు: పార్టీ ఏర్పాటు చేసిన స్వల్ప కాలంలోనే అధికారం చేపట్టి సంక్షేమానికి, సంస్కరణలకు శ్రీకారం చుట్టిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. శనివారం పలమనేరులో తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అన్నదానం చేశారు.

● శాంతిపురం, సోమల, చౌడేపల్లె, సదుం, రామకుప్పం, పుంగనూరు, కల్లూరు, వి.కోట, పెద్దపంజాణి మండలాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు. అన్నదానాలు చేపట్టారు.



పెద్దపంజాణి మండలం చలమంగళంలో...



రామకుప్పం టీడీపీ కార్యాలయం వద్ద..



శాంతిపురంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూజలు



పుంగనూరులో..



కుప్పం మండలం చెక్కునత్తంలో..



పులిచెర్ల మండలంలో...

క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తేనే లక్ష్యాలు సాధ్యం

● పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ



సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ

పలమనేరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తేనే లక్ష్యాలు సాధ్యమవుతాయని.. బాలికలకు చదువే విలువైన ఆభరణమని పలమనేరు సీనియర్ జడ్జి ఆదినారాయణ అన్నారు. శనివారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ లైంగిక నేరాలను నివారించేందుకు పోక్సో చట్టాన్ని ప్రభుత్వం ప్రత్యేకంగా తీసుకొచ్చిందన్నారు. చట్టం 2012 లో అమల్లోకి వచ్చినప్పటికీ నేరాలు పెరుగుతున్నాయని.. ప్రధానంగా పెరుగుతున్న జనాభాలో 35 శాతం జనాభా 18 సంవత్సరాలకంటే తక్కువ వయస్సున్న వారే అన్నారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు మొదట తల్లిదండ్రులకు.. పాఠశాల యాజమాన్యానికి తెలియజేయాలన్నారు. బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని.. ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో గౌరవింపబడాలని సూచించారు. పలమనేరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్.భాస్కర్, ఎస్.ఐ స్వర్ణతేజ, సీడీపీవో ఇందిరాప్రియదర్శిని, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కుప్పమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో మార్పులు ఎన్టీఆర్ ఘనతే



విద్యార్థినికి ధ్రువపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థలో మార్పులు తీసుకురావడంతో పాటు అవకాశాలను సృష్టించిన ఘనత ఎన్టీఆర్‌దేనని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. ఎన్టీఆర్ తరువాత ఆ స్థానాన్ని చంద్రబాబు మరింత ముందుకు తీసుకుపోయారని అన్నారు. శనివారం సాయంత్రం పలమనేరు మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన 43వ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరనాథరెడ్డి మాట్లాడుతూ విద్యావ్యవస్థలో మార్పులకు ఎన్టీఆర్ హయాంలోనే ప్రారంభమైందని.. నేడు దేశవిదేశాల్లో విద్యార్థులు గొప్ప స్థానాల్లో రాణిస్తున్నారంటే నాడు చంద్రబాబు తీసుకున్న నిర్ణయాలే అన్నారు. పలమనేరు మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో అదనపు బ్లాక్ నిర్మించేందుకు గత తెలుగుదేశం ప్రభుత్వంలో రూ. 9 కోట్లు మంజూరు చేయించానని పేర్కొన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఆ పనులు ముందుకు సాగలేదన్నారు. అనంతరం కళాశాలలో ప్రతిభ కనబరచిన విద్యార్థినులకు ధ్రువపత్రాలు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బెహరా శ్రీనివాస్, హెచ్‌వోడీ మొహమ్మద్, సూపరింటెండెంట్ సురేష్, కళాశాల అధ్యాపకురాలు రుక్మిణి, విద్యార్థినులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జడ్జి కృష్ణవంశీ

పెద్దపంజాణి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని పుంగనూరు జూనియర్ సివిల్ జడ్జి కృష్ణవంశీ అన్నారు. శనివారం పెద్దపంజాణి మండలం బట్టందొడ్డి పంచాయతీ శ్రీరామాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థి దశ నుంచి చట్టాలపై అవగాహన కలిగి ఉంటే సమాజంలో నేరాల తీవ్రత తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమణప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

● ఆసుపత్రికి తరలించిన టీడీపీ నేత

రామకుప్పం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం మిట్టపల్లె వద్ద శనివారం మధ్యాహ్నం ఆటో, ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో మణీంద్రంకు చెందిన సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి తీవ్రగాయాలకు గురయ్యాడు. సుబ్రహ్మణ్యం ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఆటో అక్కడి నుంచి వెళ్లిపోయింది. దీంతో సుబ్రహ్మణ్యం అపస్మారక స్థితిలో రోడ్డు పక్కన ఉండగా అటుగా వచ్చిన తెలుగు యువత మణీంద్రం పంచాయతీ అధ్యక్షుడు దినేష్ గమనించి అతడిని రామకుప్పం ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం పెద్దాసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో దినేష్ తన వాహనంలోనే కుప్పం పీఈఎస్ ఆసుపత్రికి తరలించారు. మానవత్వాన్ని ప్రదర్శించిన దినేష్‌ను పలువురు అభినందించారు.

వి.కోట ఎస్సైగా జావేద్‌బాషా



వి.కోట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వి.కోట అర్బన్ ఎస్సైగా ఎస్.జావేద్‌బాషా శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై బాబు కుప్పంకు బదిలీ కాగా.. ఆయన స్థానంలో అనంతపురం టూటౌన్ నుంచి జావేద్‌బాషా బదిలీపై వి.కోటకు వచ్చారు. శనివారం ఉదయం బాధ్యతలు స్వీకరించిన ఆయన పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపడుతామని తెలిపారు.

ఆక్రమణలపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

పుంగనూరు రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వనమలదిన్నె పంచాయతీలోని బెల్లం కుంటను కొంతమంది ఆక్రమించినట్లు మీర్జేపల్లె గ్రామస్తులు తహసీల్దార్ రాముకుకు శనివారం ఫిర్యాదు చేశారు. రెండు రోజుల్లో పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు హామీ ఇచ్చారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

పుంగనూరు రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ లోకేశ్ హెచ్చరించారు. శనివారం పట్టణ సమీప ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పట్టుబడిన నలుగురుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు

పుంగనూరు రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలంలోని ఆరడిగుంట- కుమ్మరగుంట మార్గంలో ఓ ప్రైవేటు పాఠశాల బస్సు ట్రాక్టర్ ఢీకొనడంతో ముగ్గురు విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. కుమ్మరగుంటకు చెందిన నాలుగో తరగతి విద్యార్థులు అభిలాష్, పూజిత, పునీత్ స్కూల్ బస్సులో ప్రయాణిస్తుండగా గాయపడటంతో చికిత్సలు చేయించారు.

పేదరికంలేని సమాజమే ఎన్టీఆర్, చంద్రబాబు ధ్యేయం

నారా భువనేశ్వరి

కుప్పం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజ నిర్మాణమే టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్, ప్రస్తుత అధ్యక్షుడు చంద్రబాబు ధ్యేయమని ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి తెలిపారు. శనివారంనాడు భువనేశ్వరి టీడీపీ ఆవిర్భావ దినోత్సవాల్లో పాల్గొని పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. టీడీపీ సభ్యత్వ కార్డులను పార్టీ కార్యకర్తలకు పంపిణీ చేశారు.కార్యకర్తలే పార్టీకి ఎనలేని బలమని, వారికి తమ కుటుంబం, పార్టీ మొత్తం రుణపడి ఉన్నదన్నారు.కార్యకర్తలకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా అండగా నిలబడుతామని, అది తమ బాధ్యత అని స్పష్టం చేశారు. ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా కుట్టు మిషన్లు, తోపుడు బండ్లు పంపిణీ చేశారు. అంతకుముందు షాహీ గార్మెంట్స్‌లో మహిళా కార్మికులతో ముఖాముఖి సమావేశమయ్యారు.మహిళా సాధికారత సాధించడానికి ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు కృషి చేస్తున్నదని, అందుకు తగిన కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తున్నదని భువనేశ్వరి చెప్పారు.కుప్పంలో 150 మంది మహిళలకు తమ ట్రస్టు ద్వారా వివిధ చేతి వృత్తులపై ఉచిత శిక్షణ ఇస్తున్న విషయాన్ని గుర్తు చేశారు.వారు తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కూడా కల్పిస్తామని చెప్పారు.ఎన్టీఆర్ ట్రస్టు సీఈవో రాజేంద్రకుమార్ మాట్లాడుతూ ట్రస్టు సేవా కార్యక్రమాలను వివరించారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్,ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ నేతలు బీఆర్.సురేశ్‌బాబు, గౌనివారి శ్రీనివాసులు,రాజ్‌కుమార్, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కుట్టు శిక్షణ పొందిన మహిళలతో నారా భువనేశ్వరి



టీడీపీ సభ్యత్వ కార్డులు పంపిణీ చేస్తూ...

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

రోడ్లు ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకోరా?
గంగాధరనెల్లూరు మండల మీట్‌లో సభ్యుల ధ్వజం

గంగాధరనెల్లూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల వద్ద ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన రోడ్లను ఆక్రమిస్తున్నా అధికారులు పట్టించుకోరా? అంటూ వెజ్జుపల్లె సర్పంచ్ హరిప్రసాద్‌రెడ్డి, వేపంజేరి ఎంపీటీసీ రామచంద్రారెడ్డి ధ్వజమెత్తారు. గంగాధరనెల్లూరు మండల సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ అబ్బూ అనిత అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా గంగాధరనెల్లూరు సర్పంచ్ సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీలు భారతి, రామచంద్రారెడ్డి, బుక్కాపట్నం సర్పంచ్ మునిరాజారెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు తదితరులు పలు సమస్యలను ప్రస్తావించారు. ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, వైస్ ఎంపీపీ బేబి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు ఏకాంబరం, అధికారులు పాల్గొన్నారు.



డ్రోన్ కెమెరాతో నిఘా: డీఎస్పీ

వెదురుకుప్పం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ కెమెరాతో నిఘా ఉందన్న విషయాన్ని మరచిపోవద్దని నగరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ హెచ్చరించారు. శనివారం కార్వేటినగరం గాండ్లమిట్ట క్రాస్ రోడ్డులో సీఐ హనుమంతప్ప, ఎస్ఐ రాజ్‌కుమార్, సిబ్బందితో కలసి డ్రోన్ కెమెరా పనితీరును పరిశీలించారు. ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడినా, సారా, పేకాట స్థావరాలపై, బాలికలు, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా డ్రోన్ కెమెరాతో గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన ఏఎంసీ చైర్‌పర్సన్

విజయపురం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి):నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్‌ను శనివారం తిరుపతిలోని ఆయన స్వగృహంలో ఏఎంసీ చైర్‌పర్సన్‌గా నియమితులైన రాజమ్మ మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి చినబాబును కూడా కలిసి వారికి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు చుక్కా ధనుంజయయాదవ్, బాలసుబ్రహ్మణ్యంరాజు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ ఏటీఎం ప్రారంభం

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ సమీపంలోని గంగాసాగరం వద్ద డీసీసీబీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏటీఎంను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ శనివారం ప్రారంభించారు. డీసీసీబీ సీఈవో శంకర్‌బాబు, టీడీపీ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు

బంగారుపాళ్యం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జామియా మసీదులో శనివారం సాయంత్రం ముస్లింలకు టీడీపీ మండల అధ్యక్షుడు జయప్రకాష్, ధరణీలు ఇఫ్తార్ విందు ఇచ్చారు. రహ్మతుల్లా ఖాన్, జనార్దన్ గౌడ్, లోకనాథ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకోవడానికి వైసీపీ కుట్ర: తెలుగు యువత

చిత్తూరు సిటీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకునేందుకు వైసీపీ నేతలు కుట్రలు పన్నుతున్నారని తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి వరుణ్ కుమార్ విమర్శించారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. చిత్తూరు వైసీపీ ఇన్‌చార్జిపై 17 కేసులు ఉన్నాయని ఆరోపించారు. బెంగళూరులో తన వ్యాపారాలను పక్కనపెట్టి పుట్టిన ఊరిని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో వచ్చిన ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌పై వైసీపీ నేతలు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తూ రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. అందులో భాగంగానే శనివారం టీడీపీ కార్యకర్తలైన వేణుగోపాల్, సాయితేజలపై వైసీపీ రౌడీలు దాడిచేశారన్నారు. దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, నేతలు మోహన్‌రాజ్, రవికుమార్, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న వరుణ్ కుమార్


ఐరాలలో టీడీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మురళీ మోహన్


గంగాధరనెల్లూరులో కేక్ కట్ చేస్తున్న ప్రభుత్వ విప్ థామస్


నగరిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసిన ఎమ్మెల్యే భానుప్రకాష్

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

చిత్తూరు సిటీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పార్టీ వ్యవస్థాపకుడైన ఎన్టీఆర్‌కు నాయకులు, కార్యకర్తలు నివాళి అర్పించారు. పార్టీ జెండాలను ఆవిష్కరించారు. కేకులు కట్ చేశారు. నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, నాయకులు సురేంద్రకుమార్, చంద్రప్రకాష్, కోదండయాదవ్, ఇందిర, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు అరుణ తదితరులు పాల్గొన్నారు.

పూతలపట్టు: ఐరాల, యాదమరి, బంగారుపాళ్యం మండల కేంద్రాల్లో, తవణంపల్లె మండలంలోని అరగొండ కొత్త బస్టాండు వద్ద, పూతలపట్టు మండలం పాలకూరు బస్టాండు వద్ద జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే మురళీ మోహన్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: గంగాధరనెల్లూరు బస్టాప్ వద్ద, పాలసముద్రం మండలంలోని బలిజకండ్రిగ కూడలిలో జరిగిన వేడుకల్లో ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నగరి: టవర్‌క్లాక్ వద్ద జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రానైట్ లారీ స్వాధీనం

యాదమరి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్న లారీని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం భూగర్భ గనుల శాఖ ఆర్ఐ శ్రీనివాసులు ముద్దు రామాపురం వద్ద తనిఖీలు చేపట్టారు. బిల్లులు లేకుండా అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్న లారీని గుర్తించారు. కేసు నమోదు చేసి వాహనాన్ని యాదమరి పోలీసులకు అప్పగించారు.




చర్చివీధిలో పండుగ సామగ్రి కొనుగోలు చేస్తున్న జనం

నగరంలో ‘ఉగాది’ సందడి

చిత్తూరు కల్చరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ సందర్భంగా నగరంలోని చర్చి వీధి శనివారం జనంతో కిక్కిరిసింది. పండుగ సామగ్రి కొనుగోళ్లతో దుకాణాలన్నీ కిటకిటలాడాయి. అలాగే పలు ఆలయాల్లోనూ ఆదివారం ఉగాది వేడుకలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. నాగయ్య కళాక్షేత్రంలో కలెక్టర్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు జరగనున్నాయి.

‘ఉపాధి’ నిధులు రూ.61వేల రికవరీకి ఆదేశం

బంగారుపాళ్యం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనుల్లో రూ.61వేలు దుర్వినియోగమైనట్లు గుర్తించి, రికవరీకి ఆదేశించినట్లు పీడీ రవికుమార్ తెలిపారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో సామాజిక తనిఖీ బహిరంగ సభ జరిగింది. 41 పంచాయతీల్లో రూ.8,61,91,703 పనులు జరగ్గా, ఇందులో రూ.61వేలు దుర్వినియోగం జరిగినట్లు అధికారులు గుర్తించారు. డీవీవో శివయ్య, పుంగనూరు క్లసర్ ఏపీడీ రవి, ఎంపీడీవో శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

నగరి మెప్మా సిబ్బందికి ప్రశంస


ధ్రువీకరణ పత్రాన్ని చూపిస్తున్న కమిషనర్, సిబ్బంది

నగరి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ ప్లాట్‌ఫామ్‌లో మార్చి 8వ తేదీన ఒక్కరోజే అత్యధిక లావాదేవీలు నిర్వహించడంతో రాష్ట్రానికి గిన్నిస్ వరల్డ్ రికార్డు దక్కిందని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి తెలిపారు. ఇందులో 597లావాదేవీలతో సహకరించిన నగరి మెప్మా సిబ్బందిని శనివారం ఆయన ప్రశంసించారు. మెప్మా మేనేజర్ ప్రసాద్, స్వరూప, హిమబిందు, లావణ్య, రిసోర్సు పర్సన్లు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం

గుడిపాల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ పొందిన ఎంపీడీవో శివరాజన్‌ను శనివారం బీజేపీ నేతలు చిట్టిబాబు, స్వామినాథ్ గౌడ్ సత్కరించారు. నాయకులు చంద్ర, దేవా, సుభాష్, గోపి, సాయి, ప్రతాప్ పాల్గొన్నారు.



155 మందికి వైద్య పరీక్షలు

తవణంపల్లె, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అరగొండ అపోలో హాస్పిటల్‌లో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 155 మందికి కిడ్నీ తదితర వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన ఐదుగురికి ఉచితంగా చేయిస్తామని మేనేజరు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. యురాలజిస్టు డాక్టర్ శంకర్, జనరల్ మేనేజరు వినోద్, పీఆర్వో కమరుద్దీన్ పాల్గొన్నారు.

సినిమా పోస్టర్ ఆవిష్కరణ



తవణంపల్లె, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): దిగువమాఘంలోని తన స్వగృహంలో మిషన్007 సినిమా పోస్టర్‌ను మాజీ మంత్రి గల్లా అరుణకుమారి శనివారం ఆవిష్కరించారు. సినిమా ట్రైలర్‌ను హీరో దొడ్ల భరత్.. మాజీ మంత్రికి చూపించారు. అరుణకుమారి మాట్లాడుతూ ఏప్రిల్ 3న విడుదల కానున్న ఈ సినిమా నిర్మాత, డైరెక్టర్ హీరోలు జిల్లావాసులు కావడం గర్వకారణం అన్నారు. డైరెక్టర్ మోహన్‌కాంత్, చిత్ర బృందం పాల్గొన్నారు.

‘పాస్టర్ మృతిపై మిస్టరీని ఛేదించాలి’

నగరి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై మిస్టరీని తక్షణం ఛేదించాలని జైభీమ్ నాయకుడు రామచంద్రన్ డిమాండ్ చేశారు. నగరి సంత మైదానం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం ఉదయం 11 గంటలకు కాంగ్రెస్, ఏపీ బీఎస్పీ, దళిత, క్రైస్తవ సంఘాలతో కలిసి నిరసన తెలిపారు. శేఖర్, రమేష్, నాగూర్, చంద్రయ్య, పాల్‌రాజ్, మిల్టన్ టైటస్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ జ్ఞాపిక బహూకరణ

నగరి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి):టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరి మున్సిపాలిటీకి చెందిన రామానుజం చలపతి,లత ఆధ్వర్యంలో శనివారం తెలుగుమహిళలు కుప్పంలో నారా భువనేశ్వరిని కలిశారు. టీడీపీ జ్ఞాపికతోపాటు సారె, చీర అందజేశారు. తెలుగుమహిళలు భారతి, హేమ, అలిమేలు, అంజేరమ్మ, ఆదెమ్మ, యువత అయ్యప్ప, గజేంద్ర పాల్గొన్నారు.

విద్యార్థినులకు కరాటేపై శిక్షణ

చిత్తూరు సెంట్రల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రూపేష్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం బీఎస్ కన్నన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు కరాటేపై శిక్షణ ఇచ్చారు. మహిళా స్టేషన్ డీఎస్పీ విజయశేఖర్ మాట్లాడుతూ.. కరాటేలో శిక్షణ ఇవ్వడం ఎంతో ఉపయోగకరమన్నారు. కరాటే మాస్టర్ దివ్య, ఎస్ఐ నాగసౌజన్య, టీచర్లు పాల్గొన్నారు.

అర్జీలపై ఆడిట్ పకడ్బందీగా చేయండి: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులు, పీజీఆర్ఎస్ ద్వారా అందిన అర్జీలపై క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా ఆడిట్ నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో కలెక్టరేట్ పరిపాలనా విభాగంలో పనిచేస్తున్న తహసీల్దార్లు, డీటీలతో సమావేశం నిర్వహించారు. డీఆర్వో మోహన్‌కుమార్, కలెక్టరేట్ ఏవో కులశేఖర్ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో తనిఖీలు

బంగారుపాళ్యం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి):సుపోషిత్ గ్రామ పంచాయతీ అభియాన్‌కింద ఎంపికైన నలగాంపల్లె అంగన్వాడీ కేంద్రాన్ని శనివారం జిల్లా కో-ఆర్డినేటర్ ప్రభ తనిఖీ చేశారు. బంగారుపాళ్యం ప్రాజెక్టు అధికారి అనురాధ పాల్గొన్నారు.